


సింహాద్రి వాత్సల్యంతో కొంచెం ఓరిమి నటించి మరీ నవ్వి, పిల్లవాడు చెప్పింది నిజమే, నా పాత జన్మలో ఓసారి ఒకడిలాగే ఊరిమీద బందిపోట్లు రేపో మాపో పడుతున్నారని తెలిసి తక్షణం, తన డబ్బుని అడిగిన వాడికి అడగని వాడికి కూడా అప్పిలిచ్చేసి ఋణపత్రాలు రాయించుకొని అవి ఓ పెట్టెలో భద్రపరచుక్కూర్చున్నాడు. మూడోనాడు దొంగలు రానే వచ్చారు. దోపిడీ చెయ్యనే చేశారు. నాలుగోనాడు నా మిత్రుడు ఉప్పొంగిపోతూ ఊరేగి, నా బాకీలు తీర్చండి అని రభస చేశాడు. దొంగలు కొల్లగొట్టారు ఎక్కడ తెమ్మన్నావు అని వాళ్లంతా మొత్తుకున్నారు. ఆ మాట న్యాయాధికారికి చెప్పుకోండి, నేను అభియోగం తెస్తున్నా మీమీద అంటూ, అతడు ఉత్సాహంగా ఇంటికెళ్లి ఋణపత్రాలు తీసుకోబోయాడు అని సింహాద్రి ఆగాడు. కాబట్టే అప్పులు ముప్పులు నివారించే శ్రీరామరక్షలుగదా అన్నాడు.

అలాగేం? ఆ తరువాత కథ నాకు తెలీదనుకున్నావా అంది నాగలక్ష్మి వెటకారంగా.... సుబ్బన్న ఆమె వంక కుతూహలంతో చూశాడు.

## గడసరి కథాంతం

గుర్తులేదూ. నువ్వే ఆ జన్మలో ఈ పనిచేసిన వాడివి. తీరా ఆ రోజున నువ్వు ఋణపత్రాలు చూడబోయేసరికి అవిలేవు. బందిపోటు దొంగలు దోపిడి హడావిడిలో నీ యిల్లు కొల్లగొట్టి ఋణపత్రాల పెట్టిచూసి అందులో డబ్బుంటుందని పారబడి అదీ పట్టుకుపోయారు గదా. అందుకే నువ్వు కోర్టుకెళ్లలేకపోయావు. అప్పులివ్వకుండా ఉంటే అయ్యో నా డబ్బు దోచుకుపోయారు అని అందరితోపాటు సమానంగా ఉత్సాహంగా యేడ్చి, ఎవరిదగ్గరేనా సాయం సంపాయించే వాడివి. అప్పులివ్వడం వల్ల ఆఖరికి ఆ యేడుపుకికూడా సదుపాయం లేకపోయింది. అంచేత ఇప్పుడు ఈ పుట్ట ఇవ్వద్దు. కూలిపోతే హాయిగా ఏడుద్దాం అంది నాగలక్ష్మి.

మీరు యిలా హఠాత్తుగా కాదంటే యెలా? మీరు కాదనరన్న ఆశతో మేము ఇందులో దిగాం కదా. మూడుపూటలు గడువివ్వండి ఖాళీ చేస్తాము అన్నాడు సింహాద్రి.

సుబ్బన్న మందహాసం చేశాడు. అప్పు దొరుకుతుందన్న వూహతో గాలిపుట్టలు కట్టుకోడం చాలా పొరపాటు– ఐదారు జన్మల తరువాత నువ్వు గాలిమేడ కట్టబోయినట్టు అన్నాడు.

సింహాద్రి గుండె గతుక్కుమంది. నేనింకా ఐదారు జన్మలెత్తాలా.

ఐదారేం ఖర్మ.... జన్మజన్మలా బ్రాటోవర్లు సర్దుబాటై ఇచ్చి పుచ్చుకోడాల్లో బేరీజు సరిపడేదాక ఇదే పని.

ఐతే అప్పుడు నేనేం చేస్తాను? ఏమవుతుందీ అన్నాడు సింహాద్రి.

★ ★ ★